## క్లుప్తంగా

### పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే తగిన గుర్తింపు

**వైఎస్సార్ సీపీ నాయకులు కత్తెర సురేష్, బత్తుల బ్రహ్మానందరెడ్డి**

**తాడికొండ:** పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని, పార్టీ పదవులు, సంస్థాగత నిర్మాణంలో సమర్థులకు పెద్దపీట వేసి 2024లో విజయం సాధిస్తామని నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. గుంటూరు భారత్ పేటలోని నియోజకవర్గ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పార్టీ విజయానికి కార్యకర్తలే పునాది అని పేర్కొన్నారు. విభేదాలు విడనాడి అందరూ కలిసికట్టుగా పనిచేసేందుకు ఏమైనా లోపాలు ఉంటే సరిదిద్దుకొని ముందుకు నడవాలని సూచించారు.

### ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

**తాడేపల్లిరూరల్:** ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో శుక్రవారం కార్పొరేషన్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గత రెండు రోజుల నుండి వడ్డేశ్వరంలో తాగునీటిని సరఫరా చేసే విద్యుత్ మోటార్లు విద్యుత్ హెచ్చు తగ్గుల వల్ల కాలిపోయాయి. వాటిని మరమ్మతులు చేసేందుకు తొలగించగా వడ్డేశ్వరం పరిధిలోని అన్ని ప్రాంతాలకు తాగునీటిని కార్పొరేషన్ ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నట్లు ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు.

### బోరు పంపునకు మరమ్మతులు

**తాడేపల్లిరూరల్:** ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి హరిజనవాడలో శుక్రవారం కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బంది బోరు పంపునకు మరమ్మతులు నిర్వహించారు. గత కొంతకాలంగా బోరుపంపు మరమ్మతులకు గురై తాగునీటి సరఫరా లేకపోవడంతో సచివాలయ సిబ్బందికి స్థానికులు ఫిర్యాదు చేశారు. కొండప్రాంతంలో ఉన్న బోరుపంపు పైపులను తొలగించి కొత్త పైపులైను ఏర్పాటు చేయడంతో బోరుపంపులో తిరిగి యథాప్రకారం తాగునీరు సరఫరా అవుతోంది.

### చెరువులో పాదలు తొలగింపు

**ఫిరంగిపురం:** మండలంలోని వేములూరిపాడులోని చెరువు ప్రాంతంలో పంచాయతీ నిధులతో శుక్రవారం పాదలు తొలగింపునకు చర్యలు తీసుకున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.ఆనంద్ తెలిపారు. ఇటీవల జలజీవన్ మిషన్ ద్వారా వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.1.85 లక్షల నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ పనులకు నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ శంకుస్థాపన చేశారని అప్పటి నుంచి చెరువులో రెండు పొక్లెయిన్‌ల ద్వారా పిచ్చి మొక్కలు తొలగిస్తున్నట్లు వివరించారు. పదిరోజుల పాటు పొక్లెయిన్‌తో 47 ఎకరాల చెరువులో పనులు చేస్తున్నామని పేర్కొన్నారు.

### ఆర్థిక సాయం

**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ఎస్సీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి శుక్రవారం 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

**చేనేత కార్మికునికి..**

**మంగళగిరి:** నగరంలోని టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు అందె సాంబశివరావుకు పట్టణ పద్మశాలీయ సంఘం, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, గంజి రవీంద్రనాథ్ ఆర్థిక సహాయం అందజేశారు. సాంబశివరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకుని పద్మశాలీయ సంఘం రూ.5వేలు, చిరంజీవి, రవీంద్రనాథ్ రూ.10వేలు శుక్రవారం సాంబశివరావు కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దామర్ల కుబేరస్వామి, చింతక్రింది కనకయ్య, రామనాథం పూర్ణచంద్రరావు, వంగర పెదలక్ష్మయ్య పాల్గొన్నారు.

### మ్యాజిక్‌పై శిక్షణ తరగతులు ప్రారంభం

**తాడేపల్లిరూరల్:** ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో ఓ ప్రైవేటు విద్యా సంస్థలో శుక్రవారం నుంచి మ్యాజిక్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, ఎంటీఎంసీ బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, ప్రఖ్యాత ఇంద్రజాలకులు క్రాంతికర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి మ్యాజిక్ ఉపయోగపడుతుందని చెప్పారు. మనకు ఎంతో ఇచ్చిన సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలనే ఆలోచనతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నేటి నుంచి 14వ తేదీ వరకు ఈ శిక్షణ శిబిరం కొనసాగుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ తీసుకున్న వారికి మ్యాజిక్ మెటీరియల్ అందజేస్తామని వివరించారు. అనంతరం క్రాంతికార్ చేసిన మ్యాజిక్ షో చిన్నారులను అలరించింది.

### బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

**మంగళగిరి:** బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ రమేష్ బాబు హెచ్చరించారు. నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురిని శుక్రవారం అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మద్యం బాబులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మళ్లీ దొరికితే కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు.

# రాజధాని పేదలకు న్యాయం

- హైకోర్టు తీర్పుపై హర్షం
- స్వాగతించిన బహుజన పరిరక్షణ సమితి నాయకులు

**తాడికొండ:** రాజధాని ప్రాంతంలో పేదలకు 54 వేల పట్టాలిచ్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ హైకోర్టు తీర్పునివ్వడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని ఆర్–5 జోన్‌లో పేదలకు స్థలాలిచ్చేందుకు ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 45పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలంటూ దాఖలైన పిటీషన్‌ను కొట్టివేస్తూ తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో పేదలు ఉండకూడదని అనడం ఎలా అని ప్రశ్నించిన హైకోర్టు పలానా వారికి స్థలాలు ఇవ్వొదని చెప్పడం కరెక్టు కాదన్నారు. దీనిపై బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సుదీర్ఘంగా పోరాటం చేస్తున్న నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు కులవాదం ముసుగులో పేదల హక్కులను హరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కోర్టు తీర్పును స్వాగతిస్తూ తమ ఉద్యమం సత్ఫలితాలు సాధించిన నేపథ్యంలో బహుజన పరిరక్షణ సమితి నాయకుల అభిప్రాయాలు..



తాడేపల్లిలో ఇళ్ల పట్టాలు సిద్ధం చేస్తున్న సిబ్బంది

**హైకోర్టు తీర్పుతో పేదల హర్షం**

**తాడేపల్లిరూరల్:** నగరపాలక సంస్థ పరిధిలో నివాస స్థలాలు లేని వారికి నివాస స్థలాలు ఇచ్చేందుకు సీఆర్‌డీఏ పరిధిలో మూడు ప్రాంతాల్లో 395.41 ఎకరాలను ప్రభుత్వం ప్రత్యేక జీఓ ద్వారా కేటాయించింది. ఈ జీఓను వ్యతిరేకిస్తూ కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో సందడి నెలకొంది. హైకోర్టులో తీర్పు వెలువడిన వెంటనే మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో మొత్తం 11,139 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు గతంలో పట్టాలను కేటాయించారు. హైకోర్టులో ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి వీలు లేదంటూ పిటిషన్ వేయడంతో ఆ పట్టాలను కార్పొరేషన్ కార్యాలయంలో భద్రపరిచారు. తీర్పు అనుకూలంగా రావడంతో ఆయా ప్రాంతాల్లోని లబ్ధిదారుల వివరాలను నమోదు చేసేందుకు సచివాలయ రెవెన్యూ సిబ్బంది, ఆయా వార్డుల వలంటీర్లు వారి పరిధిలో ఉన్న లబ్ధిదారుల పట్టాల్లో పేర్లను, ఇతర వివరాలుక్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్పొరేషన్ వ్యాప్తంగా విలీన గ్రామాలతో కలసి తాడేపల్లి పట్టణ రూరల్‌లో 6,540 మందికి, మంగళగిరి రూరల్‌లో 4,599 మందికి జిల్లా కార్యాలయం నుంచి పట్టాలు వచ్చాయని వాటిలో ఉన్న పేర్లను పరిశీలిస్తున్నట్లు వివరించారు.

### ఎల్లో మీడియా విష ప్రచారం



ప్రభుత్వాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక చంద్రబాబు ఎల్లో మీడియాని అడ్డుపెట్టి చేస్తున్న తప్పుడు ప్రచారాలకు ఇకనైనా ఫుల్‌స్టాప్ పెట్టాలి. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుకూలంగా కోర్టు తీర్పు హర్షణీయం. ఎల్లో మీడియాతో కలిసి బాబు విష ప్రచారం మానుకోపోతే రాష్ట్రంలో ప్రజలు తరిమికొట్టి తగిన బుద్ధి చెప్పడం ఖాయం

– పెరికే వరప్రసాద్, న్యాయవాది

### పేదలకు శాటిలైట్ సిటీ నిర్మించాలి



పేదల కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజధానిలో కూడా మాకు 54 వేల పట్టాలిచ్చేందుకు నిర్ణయించారు. 75 ఏళ్లలో ఏ సీఎం అందించని వరాలను మాకు అందించారు. కులవాదులు మా హక్కులను అడ్డుకోవడం దుర్మార్గం. రాజధాని నడిబొడ్డున శాటిలైట్ సిటీ నిర్మాణం చేయాలి.

– మాదిగాని గురునాథం, సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు

### కులవాదుల ఆగడాలకు కళ్లెం వేయాలి



రాజధాని పేరుతో పేదలను ఈ ప్రాతం నుంచి దూరం చేసేందుకు కులవాదులు వేసిన ఎత్తుగడలకు కోర్టులో చెంపపెట్టు తగిలింది. ఈ ప్రాంతంలో అసైన్డ్ భూములను బెదిరించి తక్కువ ధరకు కొనుగోలు చేసి మోసం చేసిన కేసుల్లో కూడా బాబు అండ్ కోకు శిక్ష పడాలి. రాజధానిలో కులవాదుల ఆగడాలకు కళ్లెం వేయాలి.

– నూతక్కి జోషి, బహుజన ఉద్యమ నాయకుడు

### భూములిచ్చేసిన తరువాత కూడా..



సంతృప్తికరమైన ప్యాకేజీ తీసుకొని ప్రభుత్వానికి భూములిచ్చేసిన తరువాత కూడా వాటిపై వారికి హక్కులున్నట్లు తప్పుడు కేసులు వేస్తూ ప్రభుత్వాన్ని, పేదలను సాధించాలనుకోవడం దుర్మార్గం. ప్రజా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉండని వారిపై కూడా చర్యలు తీసుకోవాలి.

– పులి దాసు, బహుజన ఉద్యమ నాయకులు

### బహుజనులకు సానుకూల తీర్పు



పేదల హక్కులను అడ్డుకుంటూ కులవాదులు వేసిన ప్రతి కేసులోనూ కోర్టుల్లో మాకే సానుకూలంగా తీర్పు వచ్చింది. వికేంద్రీకరణ, ఇంగ్లిష్ మీడియం విద్యను అడ్డుకుంటూ కులవాదులు వేసిన కేసులతో పాటు మూడు రాజధానుల వ్యవహారంలో కూడా మాకే అనుకూల తీర్పు వస్తుంది. కోర్టు తీర్పుతో అయినా కులవాదులు కళ్లు తెరిచి వాస్తవంలోకి తొంగి చూడాలి.

– ఇందుపల్లి సుభాషిణీ, బహుజన ఉద్యమ నాయకురాలు

### కోర్టుకెళ్లిన వారిపై చర్య తీసుకోవాలి



ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా తీసుకున్న చట్టబద్ధమైన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కోర్టుకెళ్లి తప్పుడు కేసులు వేసిన వారిపై కూడా తగిన చర్యలు తీసుకోవాలి. సంతృప్తికరమైన ప్యాకేజీ తీసుకొని ప్రభుత్వానికి భూములిచ్చిన తరువాత కూడా దానిపై హక్కులు తమకు కావాలనుకోవడం దుర్మార్గం. బహుజనులకు జాగా కల్పించిన కోర్టు వారికి కృతజ్ఞతలు.

– ఈపూరి ఆదాం, బహుజన ఉద్యమ నాయకుడు

### బాబుకు రాజకీయ సన్యాసమే



రాజకీయంగా ప్రభుత్వాన్ని ఎదుర్కొలేక కులవాదాన్ని ప్రోత్సహించి శాసించాలని చూస్తున్న బాబును రాజకీయంగా బహిష్కరిస్తాం. 14 సంవత్సరాల పాలనలో పేదలకు ఒక్క మంచి పని చేయని బాబు అడ్డుకోవడం దుర్మార్గం, ఆయనకు ఇక రాజకీయ సన్యాసం తప్పదు. జగనన్న పాలనలో బాబా సాహెబ్ అంబేడ్కర్ సూచించిన బహుజన రాజ్యాధికారం త్వరలో సాకారం కానుందనేందుకు కోర్టు తీర్పే నిదర్శనం.

– బేతపూడి సాంబయ్య, బహుజన ఉద్యమ నాయకుడు

## పవర్ లిఫ్టింగ్‌లో షేక్ షబీనా ప్రతిభ

**మంగళగిరి:** పవర్ లిఫ్టింగ్ పోటీలలో తెనాలికి చెందిన షేక్ షబీనా నాలుగు బంగారు పతకాలు సాధించి రికార్డు సృష్టించింది. కేరళలో ఈనెల ఒకటో తేదీ నుంచి నిర్వహిస్తున్న పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు కోచ్ ఎస్‌కే సంధానీ శుక్రవారం తెలిపారు. షబీనా 84 కేజీల సబ్ జూనియర్ విభాగంలో నాలుగు బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. స్క్వాట్ 172.5 కేజీల విభాగం, బెంచి ప్రెస్ 75 కేజీలు, డెడ్ లిఫ్ట్ 160 కేజీల విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన షబీనా ఓవరాల్ 407.5 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిందన్నారు. ఆమెను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి పుల్లేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, సెక్రటరీ సకల కోటేశ్వరరావు అభినందించారు.



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ సాధించిన షేక్ షబీనా

## మేడికొండూరులో చోరీ

**మేడికొండూరు:** మండలం కేంద్రం అయిన మేడికొండూరులో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మేడికొండూరు సూర్యచంద్రం రోజు మాదిరిగానే షాపు మూసివేసి ఇంట్లో నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ప్రధాన తలుపు తాళం పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా లాకర్ తాళం పగులకొట్టి లోపల ఉన్న రూ.50 వేలు, రూ.50 వేలు విలువ చేసే ఒక జత చెవి దిద్దులు, రెండు ఉంగరాలు తీసుకెళ్లారు. సూర్యచంద్రానికి మెలకువ వచ్చి పరిశీలించగా బీరువా పగులకొట్టి వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం ఇంట్లో వేలు ముద్రలను సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



తాపీ మేస్త్రి గోలి శంకర్ (ఫైల్)

**మంగళగిరి:** తాపీ మేస్త్రి అదృశ్యంపై కేసు నమోదైంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. రత్నాల చెరువు కాలనీకి చెందిన గోలి శంకర్ తాపీమేస్త్రిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం పని మీద వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో శంకర్ సతీమణి గోలి కల్యాణి శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హైకోర్టు తీర్పు పేదల విజయం

- వైఎస్సార్ సీపీ నాయకుడు కత్తెర సురేష్ కుమార్
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**తాడికొండ:** పేదల ఇళ్ల స్థలాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు పేదల విజయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలో 54 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ గుంటూరులోని నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజధానిలో పేదలకు స్థలాలు వద్దంటూ కేసులు వేసిన వారిపై కూడా చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా అడ్డుకోవచ్చని, వీరి వెనుక ఉండి తప్పుడు కేసులు వేయిస్తున్న బాబు అండ్ కో ఇకనైనా తప్పుడు వ్యవహారాలు మానుకోవాలని హితవు పలికారు. ఇళ్ళు లేని నిరుపేదలకు జానెడు జాగా ఇస్తుంటే అమరావతి ముసుగులో ఉన్న టీడీపీ నాయకులకు వచ్చిన నష్టం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు చేయలేని పనులు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తుంటే ఎక్కడ తమను ప్రజలు మర్చిపోతారో అనే భయంతో టీడీపీ నాయకులకు బెంగ పట్టుకుందన్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి

## వైభవంగా మహంకాళీ విగ్రహ ప్రతిష్ట

**ఫిరంగిపురం:** మండలంలోని 113 తాళ్లూరులోని చెరువు కట్ట ప్రాంతంలో మహంకాళీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన యాగశాలలో వేదపండితులు గణపతిపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అగస్త పూజలు చేసి మహాన్యాసపూర్వక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో మహంకాళి విగ్రహ ప్రతిష్ట, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకపూజలు, అష్టోత్తర,సహస్రనామ పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం 3వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.



ప్రత్యేక అలంకారంలో మహంకాళీమాత

## రైతుల అభ్యున్నతికి మార్కెట్ కమిటీ కృషి

**మంగళగిరి:** రైతుల అభ్యున్నతే లక్ష్యంగా యార్డు కమిటీ కృషి చేస్తోందని మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి తెలిపారు. నగరంలోని మార్కెట్‌యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో శుక్రవారం కమిటీ సాధారణ సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన ఆదాయ–వ్యయాలపై సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్‌పర్సన్ మేకల నాగలక్ష్మి, డైరెక్టర్లు ఆలూరి రాజ్యం, బాపనపల్లి అన్నపూర్ణ, షేక్ మాలిని, రమాదేవి, ఇసాకమ్మ, భారతీదేవి, కుమారి, యార్డు సెక్రటరీ కె.మాధవరావు పాల్గొన్నారు.

### గంజాయి తాగుతున్న నలుగురి అరెస్టు

**గుంటూరు ఈస్ట్:** గంజాయి తాగుతున్న వారిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రెడ్డి కళాశాల సమీపంలో గంజాయి తాగుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి వంద గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వైఎస్సార్ పాలన సువర్ణయుగం

- వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం జగన్ పాలన
- ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే ఆర్కే
- మార్కెట్ యార్డులో వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణ

**మంగళగిరి:** దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన చరిత్రలో సువర్ణయుగంగా నిలిచిపోయిందని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. నగరంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ఆయన అనంతరం అధికారంలోకి వచ్చిన ఎవరైనా అమలు చేయాల్సిన పరిస్థితి కలిగిందన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాలు కోట్ల మంది జీవితాల్లో వెలుగులు నింపి వారి కుటుంబాల్లో వైఎస్సార్ దేవుడిగా నిలిచారన్నారు. వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతుందన్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీల పేరుతో రాష్ట్రంలో ఊర్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, దుగ్గిరాల మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజి, యార్డు వైస్ చైర్‌పర్సన్ మేకల నాగలక్ష్మి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు సుంకర రఘుపతిరావు, అన్నపురెడ్డి బ్రహ్మార్జునరెడ్డి, డైరెక్టర్లు ఆలూరి రాజ్యం, బాపనపల్లి అన్నపూర్ణ, షేక్ మాలిని, గండికోట వెంకటరమాదేవి, దాసరి ఇసాకమ్మ, బుర్రముక్కు భారతీదేవి, పాటిబండ్ల కుమారి పాల్గొన్నారు.



డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే ఆర్కే

# అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- ఎమ్మెల్యే ఆర్కే
- అర్ధరాత్రి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు పరిశీలన

**మంగళగిరి:** అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులకు సూచించారు. గురువారం రాత్రి ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద చేపట్టిన రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. అనంతరం నగరంలోని రాత్రి సమయంలో నిర్వహించే పారిశుద్ధ్య పనులను పరిశీలించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మహిళా పారిశుద్ధ్య కార్మికులకు ఆర్థిక ప్రోత్సాహం అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాత్రి వేళల్లో పారిశుద్ధ్య పనుల వలన నగరంలో మరింత మెరుగైన శుభ్రత కలుగుతుందన్నారు. రాత్రివేళల్లో వాహనాలు వేగంగా వెళ్లే అవకాశం ఉన్నందున కార్మికులు జాగ్రత్తగా పనులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

**ఆంజనేయ స్వామికి పంచలోహ మకర తోరణం, ఉత్సవ విగ్రహం బహూకరణ**

నగరంలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న నాలుగు కాళ్ల మండపంలోని ఆంజనేయస్వామిని వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు, దాత మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి దంపతులు పంచలోహ మకర తోరణం, పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు దాత అందజేసిన మకర తోరణం, విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వారి చేతుల మీదుగా ఆంజనేయ స్వామికి అలంకరించారు.



నగరంలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆర్కే

**ఆర్య వైశ్యుల అభివృద్ధికి కృషి**

**మంగళగిరి:** ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగరంలోని మెయిన్ బజారులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం, మహిళా సంఘ కార్యవర్గాల ప్రమాణ స్వీకారం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు వాణిజ్య, వ్యాపారాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, శివాలయం ట్రస్టుబోర్డు చైర్‌పర్సన్ నేరెళ్ల లక్ష్మీరాధిక, సంఘం ప్రతినిధులు సంకా బాలాజీ గుప్తా, నేరెళ్ల మురళి, వనమా పూర్ణచంద్రరావు, వనమా గీతాదేవి, సంకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# నేడు నూతక్కి పశువుల ఆస్పత్రి ప్రారంభం

**నూతక్కి(మంగళగిరి):** పశువుల భవనం ప్రారంభానికి సిద్ధమైంది. 1971లో ఆస్పత్రి నిర్మించగా భవనం శిథిలావస్థకు చేరింది. స్థానికులు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దృష్టి తీసుకెళ్లారు. వెంటనే అప్పటి పశుసంవర్థక శాఖ మంత్రిగా ప్రస్తుత రాజ్యసభ సభ్యులుమోపిదేవి వెంకటరమణారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన రూ.32.30 లక్షల నిధులు మంజూరు చేశారు. నిర్మాణానికి పూర్తి చేశారు. శనివారం ఉదయం 8.30 గంటలకు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నాబార్డ్ నిధులతో నగర పాలక సంస్థ నుంచి మరో రూ.6లక్షలు కేటాయించి ఆస్పత్రికి ప్రహరీ అవసరమైన మౌలిక వసతులు కల్పించారు.



పశువుల ఆస్పత్రి నూతన భవనం

# ప్లాస్టిక్ రహిత వర్సిటీని రూపొందిద్దాం

**ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్**

**ఏఎన్‌యూ:** పర్యావరణ, మానవ ఆరోగ్యాన్ని పరిరక్షించే విధంగా ప్లాస్టిక్ రహిత యూనివర్సిటీని రూపొందిద్దామని సిబ్బంది, విద్యార్థులకు వీసీ ఆచార్య పి.రాజశేఖర్ చెప్పారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 'ప్లాస్టిక్ వద్దు–ఆరోగ్యమే ముద్దు' నినాదంతో అందరం ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నిర్మూలన ఆవశ్యకతపై ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు సమాజానికి అవగాహన కల్పించాలని సూచించారు. రెక్టార్ పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కళాశాలలకు చెందిన 350 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు యూనివర్సిటీ ప్రాంగణంలో తిరిగి ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల్ని తొలగించారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య రవిశేఖర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ రవిశంకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రవికుమార్, నిరుపమ, సూర్యనారాయణ, జి.నాగరాజు, డాక్టర్ యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్లాసిక నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రవిశేఖర్

**బిజినెస్ డిబేట్‌లో విద్యార్థుల ప్రతిభ**

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిజినెస్ క్లబ్‌లో భాగంగా శుక్రవారం ప్లాన్, డిబేట్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. 18 బృందాల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పలు అంశాలలో బిజినెస్ ప్లాన్‌ను చార్టులపై పొందుపరిచి వాటిని వివరించారు. వీరిలో ప్రతిభ కనబరిచిన ఆరు బృందాల్ని రెండవ రౌండ్‌కు, వారిలో ప్రతిభ కనబరిచిన మూడు బృందాల్ని విజేతలుగా ఎంపిక చేశారు. జడ్జిలుగా విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎస్.రత్నకిషోర్, డాక్టర్ ఎస్. ప్రసన్నకుమార్ వ్యవహరించారు. బిజినెస్ ప్లాన్‌లో మొదటి బహుమతిని మౌనిక నేతృత్వంలోని బృందం, రెండవ బహుమతిని శిరీష బృందం, మూడవ బహుమతిని ఐయాజ్ బృందం గెలుచుకున్నాయి. డిబేట్‌లో మొదటి బహుమతిని రాధిక నేతృత్వంలోని బృందం, రెండవ బహుమతి అఖిల బృందం, మూడవ బహుమతి వెంకట సాయి బృందం గెలుచుకున్నాయి. కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ అధ్యక్షత వహించారు. అధ్యాపకులు నాగరాజు, విష్ణు, సుధీర్ పాల్గొన్నారు.